సాక్షి
ఏలూరు
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



రంజాన్ స్పెషల్.. సుర్మా

రంజాన్ కఠోర ఉపవాసం చేసే ముస్లింలు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తారు. దీనిలో భాగంగా కంటి కింద భాగంలో సుర్మా రాసుకుంటారు. 8లో



ధాన్యం దిగుబడి భేష్

తాడేపల్లిగూడెం మండలంలో వరి సిరులు కురిపిస్తోంది. ఎకరానికి 55 నుంచి 65 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. మాసూళ్లు జరుగుతున్నాయి. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
ఏలూరు	6.26	4.35
భీమవరం	6.23	4.38

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణకు సన్నద్ధం

జేసీ లావణ్యవేణి



ఏలూరు(మెట్రో): రబీ ధాన్యం సేకరణకు అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 120 రైతు భరోసా కేంద్రాలను ఈనెల 10 తర్వాత ధాన్యం సేకరణకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో 79,960 ఎకరాల్లో వరి సాగు చేయగా 3.11 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశామన్నారు. భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, నిడమర్రు మండలాల్లో అధిక ఉత్పత్తి ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలుకు 77 లక్షల గోనె సంచులు అవసరమవుతాయని అంచనా వేశామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి రాజకీయ వ్యవహారాలకు తావులేదని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరించేందుకు 67 కొనుగోలు సహాయక కేంద్రాలను (పీఏసీఎస్–52, డీసీఎంఎస్–10, ఎఫ్‌పీఓ–5) 120 ఆర్‌బీకేలకు అనుసంధానం చేశామన్నారు. సేకరించిన ధాన్యానికి 21 రోజుల్లోపు సొమ్ములను రైతుల ఖాతాలకు జమచేస్తామని జేసీ లావణ్యవేణి స్పష్టం చేశారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం స్థానిక సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో ప్రారంభమైంది. మూల్యాంకనానికి 1,020 మందిని నియమించినట్టు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. కేంద్రంలో ఉపాధ్యాయులకు తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన వాతావరణం, గాలి, వెలుతురు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లుచేశారు. వీటిని డీఈఓ దగ్గరుండి పర్యవేక్షించారు. మూల్యాంకన విధుల్లో చీఫ్ ఎగ్జామినర్లు 114 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 678 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 228 మంది భాగస్వాములయ్యారని చెప్పారు. జిల్లాకు 1.99 లక్షల జవాబుపత్రాలు వచ్చాయన్నారు. ప్రతి ఎగ్జామినర్ రోజుకు 40 జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుందన్నారు. ఈనెల 8 వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రాష్ట్ర పరిశీలకులు ఆర్.నరసింహరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎల్.శ్రీకాంత్ పర్యవేక్షిస్తున్నారు.

వడదెబ్బ ప్రాణాంతకం

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలచ్చని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేస్తూ ప్రజలకు, మూగజీవులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ కార్యాలయాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలని, అలాగే పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. సాధ్యమైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజలు బయటకు రాకుండా ఉండటం మేలన్నారు. వడదెబ్బ ప్రాణాంతకమని, దీని బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సహాయార్థం జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిని 94910 41422, 98499 03321 నంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా పటిష్ట ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. రాష్ట్ర సచివాలయం నుంచి సోమవారం వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై కలెక్టర్లతో సీఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మంచినీటి చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపుతున్నామన్నారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెట్ట ప్రాంతాల్లో బోర్ వెల్స్ పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు. వేసవి ఎండలు, వడగాల్పులపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. జాగ్రత్తలను వివరిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పచ్చ కుట్రలు కని పింఛెన్

వలంటీర్లపై ఆంక్షలు

- పింఛన్ల పంపిణీ ఆలస్యం
- టీడీపీ బ్యాచ్ ఫిర్యాదులతో సేవలు నిలుపుదల
- ఈనెల 3 నుంచి పింఛన్ల అందజేత
- గతంలో 1వ తేదీనే 95 శాతం పంపిణీ పూర్తి
- కూటమి నేతలపై లబ్ధిదారుల మండిపాటు



ఏలూరులో వృద్ధురాలికి సామాజిక పెన్షన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఏలూరు: పింఛన్‌పై పచ్చ కుట్రలు ఫలించాయి. ప్రతి నెలా 1వ తేదీన వేకువజామున ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న మహాయజ్ఞానికి విఘాతం కలిగింది. ఫలితంగా 58 నెలల సీఎం జగన్ పాలనలో తొలిసారిగా పింఛన్ల పంపిణీ మూడు రోజులు ఆలస్యమైంది. నెలవారీ ఖర్చుల కోసం, మందుల కొనుగోలు కోసం పింఛన్ డబ్బుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పండుటాకులకు నిరాశ ఎదురైంది. పింఛన్‌ను ఇంటికి వచ్చి ఇస్తారా.. లేదా సచివాలయానికి వెళ్లి తీసుకోవాలా అనే దానిపై కసరత్తు సాగుతోంది. జిల్లాలో 2,81,470 మంది వివిధ రకాల పింఛన్‌దారులకు ఇప్పటివరకు రూ.3,897.85 కోట్లను ప్రభుత్వం నేరుగా అందజేసింది.

నెలకు రూ.81.17 కోట్లు

జిల్లాలో 2,81,470 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, కల్లుగీత, ఒంటరి మహిళ, చేనేత, కళాకారులు వంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన 10,291 మంది వలంటీర్ల ద్వారా పింఛన్లు అందిస్తోంది. నెలకు సగటున రూ.81.17 కోట్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు అందిస్తున్నారు. ముఖ్యంగా 1వ తేదీ సాయంత్రానికి రూ.81 కోట్ల మేర పంపిణీని విజయవంతంగా పూర్తిచేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ సూపర్ సక్సెస్ కావడంతో పెన్షన్ పంపిణీ కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని పలు రాష్ట్రాల్లో అమలు చేయడానికి ఆయా ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఇంతటి విశేష ఆదరణ ఉన్న వలంటీర్ వ్యవస్థపై టీడీపీ కూటమి కక్ష కట్టి వరుసగా ఫిర్యాదులు చేసి ఎన్నికల కోడ్ పేరుతో పెన్షన్ పంపిణీకి దూరం చేసింది. దీనిపై జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్రమంగా పెన్షన్లు పెంచుకుంటూ..

గతంలో పెన్షన్‌దారులు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టింది. 2019 నుంచి ఇప్పటివరకూ రూ.3,897.85 కోట్లను పంపిణీ చేసింది. అలాగే జిల్లాలో సుమారు 25 వేలకు పైగా పెన్షన్లను పెంచింది. అర్హులను ఎప్పటికప్పుడు గుర్తించి పెన్షన్లు మంజూరు చేస్తోంది.

జిల్లాలో పింఛన్ల పంపిణీ

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందించిన మొత్తం (రూ.కోట్లలో)
2019–20	2,47,215	713.14
2020–21	2,59,198	745.25
2021–22	2,60,561	785.44
2022–23	2,70,547	813.62
2023–24	2,81,470	840.40

సేవా వలంటీర్లు

వలంటీర్ల ద్వారా సేవలందిస్తున్న ప్రభుత్వం సచివాలయాల ద్వారా 532 సేవలను ప్రజల వద్దకే తీసుకువచ్చింది. ముఖ్యంగా 29 రకాల సేవలు వలంటీర్లు మొబైల్ అప్లికేషన్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. దీనిలో భాగంగా పెన్షన్లు, క్యాస్ట్, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువీకరణ వంటి ప్రధాన సేవలు వలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్నారు. నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్ల సేవలు తెలుగుదేశం, జనసేన నాయకులకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనల పేరుతో పెన్షన్లకు అడ్డు తగిలేందుకు కుట్రలు పన్నారు. వలంటీర్ల సేవలకు అంతరాయం కలిగించారు.

వలంటీర్లపై కక్షతో..



వలంటీర్లపై టీడీపీ, జనసేన రాజకీయ నాయకులు కక్ష కట్టారు. మొదట నిందలు మోపారు. ఇప్పుడు వారిని పింఛన్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. సీఎం జగన్ పాలనలో ఒకటో తారీఖున వేకువజామునే ఠంచన్‌గా పింఛన్ వచ్చింది. చంద్రబాబు చేసిన పనికి మాలాంటి వృద్ధులకు మళ్లీ అవస్థలు తప్పడం లేదు.

– పులి కళ్యాణరావు, వెంకన్నచెరువు, ఏలూరు

నిందలు సరికాదు



వలంటీర్లపై నిందలు సరికాదు. సీఎం జగన్ నియమించిన వలంటీర్లతో పింఛన్ పంపిణీ సక్రమంగా సాగుతోంది. నాలుగున్నరేళ్లుగా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందిస్తున్నారు. గతంలో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. పింఛన్ సొమ్ములతో మందులు కొనుక్కుంటున్నా. ఈనెల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

– కృష్ణారావు, వెంకటాపురం, ఏలూరు

పింఛన్లు ఆపడం న్యాయమా..



సీఎం జగన్ పేదల బాగు కోసం రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారు. 1వ తేదీన తెల్లారకముందే వలంటీర్ల ద్వారా పింఛన్ అందిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరిలకు పేదలపై ఎంత ప్రేమ ఉందో పింఛన్ అడ్డుకున్న ఘటనతో అర్థమవుతోంది. పేదలకు సాయం చేయడం వీరికి కంటకింపుగా ఉంది.

– బోయిన నారాయణ, మండవల్లి

ఫిర్యాదులు దుర్మార్గం



మాలాంటి పేదలకు ప్రతినెలా **ఒకటో తేదీన** కోడికూయక **ముందే పింఛన్** వలంటీరు వ**చ్చి అందిస్తోంది.** వాళ్లు మా **కుటుంబంలో స**భ్యులుగా ఉ**న్నారు. అటువంటి** వాళ్లపై ప్రతిపక్షాలు పగబ**ట్టాయి. ఇంటికొచ్చి** పథకాలు అందించడం నేరం ఎందుకు అవుతుందో తెలియడం లేదు. వలంటీర్లపై బురద చల్లడం మానాలి.

– పసుపులేటి నాంచారయ్య, మండవల్లి

ఉసురు తగులుతుంది



వలంటీర్లు చాలా మంచోళ్లు. నిద్రలేవక ముందే పింఛన్ అందిస్తున్నారు. వాళ్లను మూడు నెలల వద్దన్నారంటా. అంటే పాత ప్రభుత్వంలో మాదిరి పింఛన్ కోసం ఆఫీసుల వద్ద ఎండలో నిలబడాలా. పింఛన్ పంపిణీలో అవకతవకలు లేవు కదా, వలంటీర్లను ఎలా తప్పుపడతారు. దీనికి కారణమైన వారికి మా ఉసురు తగులుతుంది.

– వీరరాఘవమ్మ, మండవల్లి

దుర్మార్గమైన చర్య



వృద్ధాప్యం మీద పడటంతో నడవలేని స్థితిలో అనారోగ్యంతో బాధపడుతున్నా. సీఎం జగన్ చలవతో ప్రతినెలా ఇంటి వద్దకే మా వలంటీర్ పింఛన్ తీసుకువచ్చి ఇస్తోంది. ఆ సొమ్ములతో మందులు కొనుక్కుంటున్నా. ఈ నెల తెలుగుదేశం పార్టీ నాయకుల దుర్మార్గమైన చర్యలతో వలంటీర్లను ఇబ్బంది పెట్టడం సరికాదు.

– గుడెల్లి నాగరత్నం, తాడిచర్ల, కామవరపుకోట మండలం

చాలా బాధాకరం



ప్రతినెలా మాదిరిగా పింఛన్ కోసం ఉదయం నుంచి వేచి చూస్తున్నా. వలంటీర్ ఎందుకు రాలేదని ఆరా తీశాను. వలంటీర్లతో పింఛన్లు ఇప్పించొద్దని టీడీపీ వాళ్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నాలాంటి ముసలోళ్లు కార్యాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోలేరు. ఇది చాలా బాధాకరం.

– పసుపులేటి సామ్రాజ్యం, మైసన్నగూడెం

పోస్టల్ బ్యాలెట్ల జారీపై ప్రత్యేక శ్రద్ధ



ఏలూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు సంబంధించి రానున్న రెండురోజులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై ఆయన సమీక్షించారు. జిల్లాలో సుమారు 25 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరమవుతాయని, ఈ మేరకు నివేదిక రూపొందించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం 85 ఏళ్లు దాటిన ఓటర్లు, దివ్యాంగుల నుంచి హోం ఓటింగుకు అభ్యర్థన పత్రాలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు వారికి ఫారం–12డీని అందజేయాలన్నారు. బీ ఎల్ఓలు, ఆయా సెక్టార్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. అలాగే ఈనెలలో నిర్వహించాల్సిన పోలింగ్ సిబ్బంది శిక్షణా కార్యక్రమంపై కలెక్టర్ సమీక్షించారు. జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, ఆర్డీఓలు వై.భవానిశంకరి, ఎస్ఎస్‌కే ఖాజావలీ, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

సీఈఓ సమీక్ష

పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు అధికారుల బాధ్యతలు, విధులపై రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ, అధికారులు హాజరయ్యారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



గణపవరం మండలం పిప్పరలో రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

గణపవరం/ఉండి: గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన సుమారు 20 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థపై తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా ఉందని, ప్రజలకు తాము నిస్వార్థంగా సేవలు అందిస్తున్నామన్నారు. తమను సేవలందించకుండా ప్రజలకు దూరం చేయడం సరికాదని, అందుకే తాము రాజీనామాలు సమర్పిస్తున్నామని అన్నారు.

వేధింపులు తాళలేక మరో ఇద్దరు

ఉండి : టీడీపీ, జనసేన నాయకుల వేధింపులు భరించలేక వలంటీర్ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్టు ఉండి మండలం ఉణుదుర్రు సచివాలయ వలంటీర్లు పొట్ల నిహారిక, డి.సూర్యకుమారి సోమవారం తెలిపారు. సీఎం జగన్ తమకెంతో గుర్తింపు ఇచ్చారని, ప్రజలతో తాము మమేకమయ్యామన్నారు. అయితే తాము ఎక్కడికి వెళ్లినా గ్రామంలోని టీడీపీ, జనసేన నాయకులు ఫొటోలు తీసి అధికారులకు పంపుతున్నారన్నారు. లేనిపోని కట్టు కథలు అల్లి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. కనీసం సాధారణ వ్యక్తుల్లా బయట తిరగనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సైతం కనీస విచారణ చేయకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇటీవల గ్రామంలో 9 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారన్నారు. ఈ నేపథ్యంలో రాజీనామా చేస్తున్నామని, ఇకపై తమ పరిధిలోని ప్రజలకు సీఎం జగన్ ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తామని చెప్పారు.

పార్థసారథికి మాట్లాడే అర్హత లేదు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు: టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథికి నూజివీడు వచ్చి మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పార్థసారథి ప్రచారంలో ఎమ్మెల్యే ప్రతాప్‌పై చేసిన విమర్శలకు ఆయన స్పందించారు. సోమవారం ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓట్ల కోసం నూజివీడు ప్రజల వద్ద మోసపూరిత మాటలు మాట్లాడవద్దన్నారు. సీఎం జగన్ నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా సహకరించారని, తాను అడగ్గానే రూ.16 కోట్లు ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో గ్రామాలు, పట్టణంలోని వార్డులు తెలియని వ్యక్తి పార్థసారథి అని దుయ్యబట్టారు. మొఘల్ చెరువు లోపల చెరువు పోరంబోకు భూమిలో నివాసముంటున్న వారికి ఏ ప్రభుత్వం పట్టాలు ఇవ్వలేదని, ఆ విషయం పార్థసారథికి తెలియదా అని నిలదీశారు. తాము 10వ వార్డులో సీసీ రోడ్లు వేయించామని, వీధి లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఓట్లు కావాలంటే గెలిస్తే ఏం చేస్తామో చెప్పుకోవాలని, పెనమలూరులో ఏం చేశారో చెప్పుకోవాలని పార్థసారథికి సూచించారు. మీకులాగా భూములన్నీ తక్కువ ధరకు కొల్లగొట్టి ఎక్కువ ధరలకు అమ్ముకోవడం మాకు చేతకాదన్నారు. నా కుమారుడు 15 ఏళ్ల నుంచి కాంట్రాక్టు ఫీల్డ్‌లో ఉన్నాడని, టెండర్ల ద్వారా పనులు వస్తేనే చేస్తున్నామన్నారు. మీ కుమారుడు కాంట్రాక్టులు ఎలా చేస్తున్నాడో నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని పార్థసారథిని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లలో జరిగిన అవినీతి అనంతమని, ఎల్అండ్‌టీ ఎందుకు కట్టలేదో టీడీపీనే చెప్పాలని అన్నారు. ముందు మీ నియోజకవర్గంలో ఏం చేశారో చెప్పి ఇక్కడ ఓట్లు అడగాలని, మంత్రిగా నూజివీడు ప్రాంతానికి ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. పదవీ, అధికార కాంక్ష తప్పితే పార్థసారథికి ప్రజలపై ప్రేమ లేదని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వంలో మంత్రి పదవి ఇవ్వలేదని పార్థసారథి టీడీపీలో చేరారని మండిపడ్డారు. పార్థసారథి తండ్రి రెడ్డియ్య టీడీపీ ఎంపీగా గెలిచి ఆ తర్వాత అమ్ముడుపోయి కాంగ్రెస్‌కు వెళ్లిన వ్యక్తి అని విమర్శించారు. ఉయ్యూరు మాజీ జెడ్పీటీసీ కొన్నాళ్లుగా పేపర్‌లో పార్థసారథి గురించి యాడ్‌లు ఇస్తోందని, దీనిని బట్టి ఆయన ఎలాంటి వ్యక్తో అర్థమవుతోందన్నారు.

మండుతున్న ఎండలు

- ఉదయం 9 నుంచే ఎండ తీవ్రత
- 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు
- చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు




భీమవరంలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

భీమవరం(ప్రకాశం చౌక్)/తణుకు: ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి చివరి వారం నుంచి ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచి ఎండ పెరుగుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో తీవ్రరూపం దాల్చుతోంది. దీంతో జనం ఇబ్బంది పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా సగటున 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల బాట పడుతున్నారు. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు పట్టణాల్లో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు సైతం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ముందస్తు జాగ్రత్తలు

జిల్లాలో ప్రతి బస్టాండ్, రైల్వేస్టేషన్, ముఖ్యమైన కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు, ఉచిత తాగునీటి సరఫరాకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు వడదెబ్బ బారినపడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం కూలీలు, కార్మికులు ఉదయం, సాయంత్రం పనులు చేసేలా, పనులు చేసే చోట చలివేంద్రాలు ఏర్పాటుకు ఆదేశించారు.

జాగ్రత్తలు తప్పనిసరి



ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఎండల్లో తిరగడం, ప్రయాణించడం వల్ల వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. ఎండల్లో ప్రయాణించాల్సి వస్తే కచ్చితంగా తలకు టవల్ లేదా టోపీ పెట్టుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో చలివేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వడదెబ్బకు గురైన వారి కోసం విలేజ్ క్లినిక్ దగ్గర నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ మహేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

ఓటు నమోదుకు 14 వరకు అవకాశం

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటు హక్కు పొందేందుకు ఈనెల 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా అర్హులేనని, వారు ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కొత్త ఓటు లేదా చిరునామా మార్పు కోసం ఈనెల 14లోపు వచ్చే దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తామని పేర్కొన్నారు. వీరికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. వాస్తవానికి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే వరకూ ఓటు నమోదుకు అవకాశం ఉందని, అయితే వాటిని పరిశీలించి జాబితాల్లో చేర్చడానికి సమయం సరిపోకపోవడంతో ఈనెల 14న దరఖాస్తుల గడువుగా నిర్ణయించారన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. 18 ఏళ్లు నిండినవారు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, ఆన్‌లైన్‌లో ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిరునామా, ఓటు మార్పు కోసం ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారి పేర్లను అనుబంధ జాబితా ద్వారా, అలాగే చనిపోయిన వారు, బదిలీ ఓటర్ల వివరాలను ఏఎస్‌డీ జాబితాలో నమోదు చేస్తామన్నారు. ఈ ఏడాది మార్చి 30 నాటికి జిల్లాలో సుమారు 14,61337 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కొత్త ఓటర్ల చేర్పు కొనసాగుతుండంతో సంఖ్య క్రమంగా పెరుగుతుందన్నారు.

'ఓపెన్' పరీక్షలకు 314 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. భౌతికశాస్త్రం పరీక్షకు 139 మందికి 107 మంది, రసాయన శాస్త్రం పరీక్షకు 147 మందికి 128 మంది, జీవశాస్త్రం పరీక్షకు 100 మందికి 79 మంది హాజరయ్యారు. జిల్లా స్థాయి పరిశీలకులు, డీఈసీ కమిటీ ప్రతినిధులు కేంద్రాలను తనిఖీ చేశారని, ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాలు చేయడం, బాల కార్మికులతో పనులు చేయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కెఏపీఎల్ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి అన్నారు. బాల్య వివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానా, జైలు శిక్ష విధిస్తారన్నారు. బాలలను పనుల్లో పెట్టుకోరాదన్నారు. బాల్య వివాహాలు గాని, భిక్షాటన చేస్తున్న పిల్లల గురించి గాని తెలిస్తే.. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు లేదా 94910 63810 నెంబరుకు సమాచారం అందించాలన్నారు.

క్రైస్తవుల మద్దతు జగన్‌కే



భీమవరంలో మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రతినిధులు

భీమవరం(ప్రకాశం చౌక్): క్రైస్తవుల మద్దతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే అని క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికారి ప్రతినిధి గుర్రం జార్జి బెన్‌హర్ అన్నారు. సోమవారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన పాలనలో క్రైస్తవులకు ఎంతో మేలు చేశారన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ఆదుకున్నారన్నారు. పాస్టర్లుకు గౌరవ వేతనం అందించి గౌరవించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,400 మంది పాస్టర్లకు గౌరవ వేతనం అందించిన ఘనత దేశంలోనే మన ముఖ్యమంత్రి జగన్‌మెహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జానస్స్ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నమల్లి సంపదరావు, బేతాళ సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.జాన్ ఎడ్వర్డ్, ఎం.రత్నకుమార్, కార్యదర్శులు మేడిది శ్యామ్, రత్నకుమార్, కరుణాకర్, స్టాన్లీ రాబర్ట్, ప్రభాకర్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ స్పెషల్.. సుర్మా

- రంజాన్ మాసంలో ప్రత్యేక స్థానం
- సుర్మా పెట్టుకోవడం పవిత్రమని ముస్లింల నమ్మకం



సుర్మా చూర్ణం



సుర్మా పెట్టుకున్న ముస్లిం సోదరులు



సుర్మా ఉత్పత్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రంజాన్ అంటేనే ముస్లింలలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. కఠోర ఉపవాసం చేసే ముస్లింలు ఈ నెలలో ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తారు. ప్రత్యేకంగా తయారు చేసే జావ, జీడిపప్పు, బాదం పప్పు, ఖర్జూరం, హలీం వంటివి ఆహారంలో తప్పనిసరిగా ఉండేలా చూసుకుంటారు. దీంతో పాటే ఉపవాస సమయంలో సుర్మాకు ప్రాధాన్యత ఉంటుంది. సుర్మా అంటే ప్రకాశవంతం, వెలుగునిచ్చేదని అర్థం. ఈ రంజాన్ మాసంలో కాటుకలా ఉండే సుర్మాను కళ్లకు పెట్టుకుంటారు. ప్రవక్త మూసా సుర్మాను తొలిసారి వాడినట్లు ముస్లింల నమ్మకం.

రంజాన్‌లో ఎక్కువగా వాడకం

సాదా సుర్మా, ముమెరా సుర్మా అని రెండు రకాలు ఉంటాయి. ముమెరా సుర్మాను వేసవిలో కంటి చల్లదనం కోసం వినియోగిస్తారు. సాదా సుర్మాను అన్ని వేళల్లో వాడొచ్చు. సౌదీ అరేబియా నుంచి నల్లటి రాళ్ల ముక్కలను దిగుమతి చేసుకొని వాటిని పొడిగా మార్చి రోజ్‌వాటర్ కలిపి సుర్మా తయారు చేస్తారు. దీనిని ఎక్కువగా రంజాన్ మాసంలో, నమాజుకు ముందు పూసుకుంటారు.

కంటికి చల్లదనం

సుర్మా కంటి కింది భాగంలో పూసుకునే ఒక పదార్థం. దీనిని కాటుకలా వాడుతారు. కంటికి పెట్టుకుంటే చల్లదనం ఇస్తుంది. రంజాన్ మాసంలో సుర్మా పెట్టుకుంటే పుణ్యం దక్కుతుందని ముస్లిం సోదరుల నమ్మకం. సుర్మాతో కంటి వ్యాధులు రావని నిరూపితం కావడంతో కేవలం ముస్లింలే కాక ఇతర మతాల వారు కూడా సుర్మాను వినియోగిస్తున్నారు. రంజాన్ నెలలో రోజా ఉన్నవారు తమ కళ్లకు సుర్మా పెట్టుకోవడం మరచిపోకూడదు. సుర్మాను పెట్టుకోవడాన్ని సున్నత్ అంటారు. ముస్లింలు అందమైన భరిణెలలో వీటిని దాచుకుని ఇంటికి వచ్చిన అతిథులకు అత్తర్‌తో పాటు కళ్ళకు పెట్టుకోవడానికి సుర్మా ఇవ్వడం సాంప్రదాయం. ఉపవాసదీక్షలో ఉన్నవారు సుర్మా పెట్టుకోవడం పవిత్రంగా భావిస్తారు.

ఆధ్యాత్మికత, ఆరోగ్యాల కలగలుపు



సుర్మాకు ముస్లింలలో ప్రత్యేక స్థానం ఉంది. నమాజుకు ముందు సుర్మా పెట్టుకోవడం సంప్రదాయంగా వస్తోంది. సుర్మా ధారణ ముస్లింలలో పవిత్రతకు, ఆధ్యాత్మికతకు, ఆరోగ్యాల మేళవింపుగా విశ్వసిస్తాం. ప్రవక్త మూసా ప్రారంభించిన సుర్మా వినియోగాన్ని అప్పటి నుంచి యావత్తు ముస్లిం జాతి సాంప్రదాయంగా పాటిస్తోంది.

షేక్ హుస్సేన్, ప్రభుత్వ ఖాజీ

రంజాన్‌లో డిమాండ్ ఎక్కువ



రంజాన్ మాసంలో సుర్మా వినియోగం ఎక్కువ. సాధారణ రోజుల్లో హిందువులు, ఇతర మతస్తులు కూడా దీనిని వినియోగిస్తుంటారు. దీనిని ఉత్పత్తి చేసే సంస్థను బట్టి రూ. 30 నుంచి రూ.300 వరకూ ధర ఉంటుంది. చిన్న పిల్లలకు గులాబ్ సుర్మా, పెద్దలకు ముమెరా (పుదీనా) సుర్మా వినియోగిస్తారు.

షేక్ షబ్బీర్ హుస్సేన్, రాయల్ సెంట్ హౌస్ అధినేత

రబీ దిగుబడి భేష్

ఎకరానికి 55 నుంచి 65 బస్తాలు



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో వరిపంట

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో వరి సిరులు కురిపిస్తోంది. ఎకరానికి 55 నుంచి 65 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. కొన్ని చోట్ల 70 బస్తాల దిగుబడి వచ్చినట్లు సమాచారం. మండలంలో 11 వేలకు పైగా హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుత రబీలో ఎక్సెల్-10, పీఆర్-126, ఎంటీయు 1121 రకాలను రైతులు సాగు చేశారు. ఎక్స్‌ఎల్-10, పీఆర్-126 రకాలు దాదాపు నాలుగు వేల ఎకరాల్లో పండించారు. ఎక్స్‌ఎల్ రకం పది రోజుల క్రితమే కోతలు ప్రారంభమయ్యాయి. పీఆర్-126 రకం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ రెండు రకాలు కలిపి దాదాపు 1500 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మరో 2,500 ఎకరాల్లో కోతలు చేయాల్సి ఉంది. ఎంటీయు 1121 రకం కోతలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా రకాల వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 55 నుంచి 65 బస్తాల దిగుబడి వస్తుందని చెబుతున్నారు.

రూ.1320కి కొనుగోలు

ఎక్స్‌ఎల్-10, పీఆర్-126 వంటి ప్రైవేట్ రకాల వరి ధాన్యాన్ని మిల్లర్లు 75 కిలోల బస్తా రూ.1320కు కొనుగోలు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో మిల్లర్లు చేలోనే ధాన్యాన్ని పట్టుబడి చేసి మిల్లులకు తరలిస్తున్నారు.

-అన్నపురెడ్డి సత్యనారాయణ, కౌలు రైతు, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం మండలం

చంద్రబాబు వ్యాఖ్యలపై డ్రైవర్ల నిరసన



భీమవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి వీరాంజనేయలును కించపరిచిన చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని భీమవరం ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. భీమవరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యింటి సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూస్తుంటే చంద్రబాబు డ్రైవర్లను అవమానిస్తూ చులకనగా, నీచంగా చూస్తున్నారని అన్నారు. ఆటోడ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.10 వేల చొప్పున ఇచ్చి గౌరవించారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని డ్రైవర్ సోదరులు చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మారోజు గణేష్, పంపన గోపి, నీలాపు రవి, గోసాలకుమార్, డ్రైవర్ సోదరులు పాల్గొన్నారు.

పెన్షన్లు అడ్డుకోవడం దుర్మార్గం



చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అవ్వాతాతలు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ల పంపిణీని చంద్రబాబు తన కార్యకర్త నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఆపించారని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. ఇది వాలంటీర్లపై చంద్రబాబుకు కక్షకు పరాకాష్ట అన్నారు. తాడేపల్లిగూడెంలో సోమవారం మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందికి గురిచేయడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు రోడ్ల మీదకు వచ్చి చంద్రబాబు అండ్ టీంను తిట్టిపోస్తున్నారని, మళ్లీ సీఎంగా జగన్‌హన్‌రెడ్డిని చేస్తామని అంటున్నారన్నారు. వలంటీర్లు రాష్ట్ర వ్యాప్తంగా రాజీనామాలు చేస్తున్నారని, వారి కుటుంబాల ఉసురు కూడా చంద్రబాబు అండ్ టీంకు తగలుతుందన్నారు.

చంద్రబాబు కుట్రలో భాగంగానే..



వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం అర్బన్: పింఛన్లను పంపిణీ చేయకుండా వలంటీర్లను తప్పించడం కుట్రపూరిత చర్య అని ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డే రఘురాం నాయుడు మండిపడ్డారు. సోమవారం ఆయన స్వగృహంలో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుంపులుగా వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌చౌదరి ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో చంద్రబాబు జేబులో వాడని ప్రజలందరికి తెలుసునన్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో ఒకటో తేదీ కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఎదురు చూస్తుంటారని, వారి ఆశలపై నీళ్ల చల్లిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహించారు. ఎన్నికల సమయంలోనే ఇన్ని కుట్రలకు పాల్పడుతున్న చంద్రబాబుకు ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పి వైఎస్ జగన్‌కు ముఖ్యమంత్రిగా మళ్ళీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

మామపై యాసిడ్ దాడి



ప్రగడ నాగేశ్వరరావు, మృతుడు

జంగారెడ్డిగూడెం రూరల్: మామపై అల్లుడు యాసిడ్‌తో దాడికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ప్రగడ నాగేశ్వరరావు (65) చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన నాగేశ్వరరావుకి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె కృష్ణవేణికి, టి.నర్సాపురం మండలం వల్లంపట్లకు చెందిన లారీ డ్రైవర్ రంగిశెట్టి రమేష్‌కి ఇచ్చి 22 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. రమేష్ కృష్ణవేణిపై వేధింపులకు పాల్పడేవాడు. దీంతో సంవత్సరం క్రితం కృష్ణవేణి పుట్టింటికి వచ్చేసింది. కృష్ణవేణిని మామ తన వద్దకు రాకుండా అడ్డుకుంటున్నాడనే అనుమానంతో సోమవారం అర్ధరాత్రి ఇంటిలో నిద్రిస్తున్న నాగేశ్వరరావుపై యాసిడ్ పోసి హత్యకు ప్రయత్నించాడు. నాగేశ్వరరావు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, బంధువులు 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగేశ్వరరావు సోమవారం ఉదయం మృతి చెందాడు. రమేష్ పరారీలో ఉండటంతో డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో మూడు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సంఘటనా స్థలంలో రమేష్ మృతదేహం



నరం రమేష్(ఫైల్)

చింతలపూడి: చింతలపూడి పట్టణానికి చెందిన నరం రమేష్(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై కుటుంబరావు కథనం ప్రకారం పట్టణానికి చెందిన రమేష్ బార్బర్ షాపు నడుపుతున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 25న ఇంటి నుంచి బయటికి వెళ్ళిన రమేష్ తిరిగి రాలేదు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ సమీపంలోని పొలాల్లో రమేష్ మృతదేహాన్ని గొర్రెల కాపరులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. చేతి మణికట్టు కోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. చనిపోయి వారం రోజులు అయి ఉంటుందని ఎస్సై తెలిపారు. మృతదేహం కుళ్ళిపోవడంతో సంఘటనా స్థలంలోనే పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొయ్యలగూడెం: పురుగు మందు తాగి బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై జీజే విష్ణువర్ధన్ సోమవారం తెలిపారు. పట్టపు శ్రీహరి (27) మద్యం తాగి భార్యతో తరచూ గొడవపడేవాడు. దీంతో జ్యోత్స్న పది రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడికి వెళ్లి భార్యను రమ్మనగా అత్తింటి వారు పంపలేదు. దీంతో మనస్తాపంతో పురుగులమందు తాగాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

తనిఖీల్లో రూ.75 వేలు స్వాధీనం



గణపవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సుభాష్

గణపవరం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎక్కువ నగదు తీసుకెళ్లే వ్యక్తులు తగిన ఆధారాలు చూపాలని, లేదంటే నగదు స్వాధీనం చేసుకుంటామని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. గణపవరం మండలం పిప్పర సెంటర్‌లో సోమవారం ఉదయం ప్రత్యేక తనిఖీల్లో నర్సాపురం ప్రాంతానికి చెందిన డి.సూర్యనారాయణ నుంచి రూ.75 వేలు స్వాధీనం చేసుకున్నారు.

నగదు సీజ్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం జాతీయప్రధాన రహదారిపై విద్యుత్ డివిజన్ కార్యాలయం చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. తనిఖీల్లో కుక్కునూరు సందీప్ నుంచి రూ.69,600 నగదు సీజ్ చేసినట్లు తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో 300 మంది చేరిక



భుజబలపట్నంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



కొమరవరంలో శెట్టిబలిజ సంఘ నాయకులతో మంత్రి కారుమూరి

కైకలూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని భుజబలపట్నంలో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాదయాత్రలో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ సమక్షంలో టీడీపీ, జనసేనకు చెందిన 300 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

తణుకు టౌన్: రాష్ట్రంలో బీసీలకు వైఎస్సార్‌సీపీ అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అనేక పదవులకు బీసీలకు అవకాశం కల్పించారని, వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కోరారు. సోమవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం కొమరవరంలోని శెట్టిబజలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొమరవరం గ్రామానికి చెందిన 70 శెట్టి బలిజ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంత్రి మాట్లాడుతూ పథకాలన్నీ వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప వద్దకే అందజేయడంతో పాటు బ్యాంక్ ఖాతాలో జమచేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు మంత్రి కండువాలు వేసి ఆహ్వానించారు. సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, సొసైటీ డైరెక్టర్ కేతా ఆంజనేయులు, శెట్టి బలిజ సంఘ నాయకులు వేండ్ర నరసింహమూర్తి, కేతా రాముడు, పాలా దానయ్య, చెల్లుబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం

ఎస్పీ డీ మేరీ ప్రశాంతి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని.. జిల్లా వ్యాప్తంగా సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టుల్లో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి చెప్పారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం చెక్ పోస్టుల్లోని పోలీస్ సిబ్బంది, అధికారులతో పరిస్థితులపై ఎస్పీ సోమవారం సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో అక్రమంగా నగదు, మద్యం, గంజాయి, నాటుసారా రవాణా, సరఫరా, విక్రయాలు జరగకుండా అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పని తీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. జిల్లాలో గత 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 47.12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎఫ్ఎస్‌టీ రూ.2.16 లక్షలు స్వాధీనం చేసుకుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 ఫ్లయింగ్ సర్వేలెన్స్ బృందాలు తనికీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు కొత్తూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన గంపా చంటి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంటి (45)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరేళ్ల క్రితం భార్య అతని నుంచి విడిపోయి పిల్లలతో వేరుగా ఉంటుంది. చంటి ఒంటరిగా ఉండడంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి



సూర్యప్రకాష్, మృతుడు(ఫైల్)

కై కలూరు: ఇంట్లో ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆటపాక పంచాయతీ జాన్‌పేటకు చెందిన పట్టపు సూర్యప్రకాష్ టైల్స్ వర్క్ చేస్తుంటాడు. తల్లి మరణించింది. అక్కాచెల్లెళ్లకు వివాహాలు జరిగాయి. తండ్రి పట్టపు బాజ్జీతో కలిసి జీవిస్తున్నాడు. వారం రోజుల క్రితం తండ్రి విజయవాడలో కూతురు వద్దకు వెళ్ళాడు. సూర్యప్రకాష్ కూడా వెళ్ళి ఉంటాడని అందరూ భావించారు. సోమవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో సమీపంలోని వారు కిటికి నుంచి చూశారు. సూర్యప్రకాష్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. వారం రోజులు క్రితం ఉరి వేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. తండ్రీకొడుకులు తరుచూ గొడవలు పడేవారని తెలిసింది. పంచాయతీ సిబ్బంది మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.